**కథ**

# బహుమతి

సణుక్కుంటూ షెల్ఫ్ సవరిస్తోంది సంధ్య.

''వాటినెందుకమ్మా పారేస్తున్నావ్?'' తల్లి చర్యకు నొచ్చుకుంటూ అడిగాడు హరి.

''దిష్టిబొమ్మల్లా ఈ చెక్కదిమ్మలు దేనికిరా?'' విసుక్కుంది సంధ్య.

''అవి చెక్కదిమ్మలు కావమ్మా. సాహితీప్రియులు ఆత్మీయతతో నాన్నగారికిచ్చిన జ్ఞాపికలు. వాటిని చూస్తే నాన్న గుర్తుకురావడం లేదూ?''

హరి మాటలు సంధ్య మనసును ములుకుల్లా తాకాయి.

కళ్ళు చెమ్మగిల్లాయి.

అంతలోనే తేరుకుని ''అవేమైనా కూడుపెడతాయా? గుడ్డలిస్తాయా? నాన్నని గుర్తుచేసుకోడానికి వాటినే చూస్తూ కూర్చోనక్కర్లేదు. మన దరిద్రమే ఆయన గారి నీడను మోసుకొస్తుంది. ఆరిందాలా మాట్లాడక పనిలో కాస్త సాయం చెయ్యి'' కొడుకును కసురుకుంది సంధ్య.

అయిష్టంగానే తల్లికి సహకరించేందుకు సిద్ధమయ్యాడు హరి. ఈమధ్య అమ్మ ప్రవర్తన అతడికేమాత్రం రుచించడం లేదు. నాన్న పోయాక అమ్మ ఎంతగా మారిపోయింది? తండ్రి బ్రతికున్నప్పుడు అమ్మ అన్నమాటలింకా అతడి స్మృతి పథంలో మెదులుతూనే ఉన్నాయి. వాళ్ళ సంభాషణ మెరుపులా కళ్ళముందు మెదిలింది.

''నేనీ లోకంలో ప్రాణంతో సమానంగా ప్రేమించేవి రెండే రెండు. ఒకటి నిన్ను. రెండు నా రచనల్ని'' భార్య కళ్ళల్లో కళ్ళుంచి ఆర్తిగా పలికాడు సత్యం.

''ఆ సంగతి నాకు తెలుసండి. నా సహకారం మీకెప్పుడూ ఉంటుంది. మీ ఆనందమే నా ఆనందం. మీరు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ సాహిత్యంలో శిఖరాగ్రాలను చేరుకోవాలన్నదే నా ఆకాంక్ష. ఆ లక్ష్యసాధనలో నేనెన్ని కష్టాలనైనా భరించడానికి సిద్ధంగా ఉన్నాను'' భర్త గుండెలమీద వాలిపోతూ అన్నది సంధ్య.

అర్ధాంగి మాటలతో సత్యానికి ఎక్కడలేని బలం వచ్చింది. ఆ తరుణంలో కొండలనైనా పిండి చేయగలననుకున్నాడు. సముద్రాల్ని సహితం అవలీలగా దాటేయగలననుకున్నాడు. వాటిముందు తను అనుభవిస్తున్న ఆర్థిక ఇబ్బందులు ఏపాటి అనిపించింది.

నాటి నాన్న ఆశయాల్ని, అభిరుచుల్ని అంతగా గౌరవించిన అమ్మ ఆయన పోగానే ఎందుకిలా మారిపోయిందో ఎంత బుర్ర బద్దలు కొట్టుకుంటున్నా అర్థం కావడం లేదు.

''అది సరే, ఆ గది ఖాళీచేసి ఏం చేయాలనుకుంటున్నావ్?'' అడిగాడు ఉండబట్టలేక.

''స్టూడెంటు కుర్రాడికెవరికైనా అద్దెకిద్దామనుకుంటున్నాను. ముందీ బల్లను పైకి లాగు'' అంది పయిట బిగిస్తూ.

''నాన్న ఆ గదిలో కూర్చుని రచనలు చేసేవారు. దానిని ఇప్పుడు ఎవరికో ఇవ్వడానికి నీకు మనసెలా ఒప్పిందమ్మా'' నిష్ఠూరంగా పలికాడు హరి.

కొడుకు మాటలొక్కొక్కటి ఆమె గుండెల్లో ఈటెల్లా గ్రుచ్చుకుంటున్నాయి. అయినా ఆమెలో ఏమాత్రం స్పందన లేదు సరికదా ''నాన్నమీద నీకున్న భక్తికి భుక్తి లభించదురా'' అంటూ హెచ్చరించింది.

మరి మాట్లాడలేదు హరి.

ఉన్నట్టుండి అతడి దృష్టి గతంలోకి మళ్ళింది..

★★★

సత్యం మంచి కవి. కథకుడు. నవలాకారుడు. అతడికెప్పుడూ రచనలమీదే తప్ప మరి దేనిమీద ధ్యాస ఉండేదికాదు.

''ప్రపంచంలో ఎక్కడైనా రచనను వృత్తిగా స్వీకరించవచ్చునేమోగాని మన దేశంలో మాత్రం అలా కుదర్దు. ఇక్కడ రచనను ప్రొఫెషన్‌గా తీసుకున్నవాళ్ళు బహుస్వల్పం. జీవిత నావని సవ్యంగా నడిపించాలంటే, నువ్వేదో ఒక పని చేయక తప్పదు'' అంటూ సహరచయితలు సలహా ఇచ్చారు.

''కథ కడుపు నింపదని నాకు తెలుసు. అయినా రాయకుండా ఉండలేను. రచన నా ఆరోప్రాణం. అందుకు నా పూర్తి సమయాన్ని కేటాయించాలనుకుంటున్నాను'' అని చెప్పి ఉద్యోగాల జోలికి పోలేదు సత్యం.

పిల్లలు కలిగినా, సమస్యలు పెరిగినా ఇచ్చినమాట కోసం కష్టాల్ని కడుపులో దాచుకుంది సంధ్య.

రైతు వర్షం కోసం ఆకాశం వంక చూసే రోజులు గతించాయేమోగాని, ఏళ్ళు గడుస్తున్నా సత్యం కుటుంబీకుల దృష్టిమాత్రం అతడికి లభించే పారితోషికం మీంచి మరలడం లేదు. అదే వాళ్ళకు జీవనాధారం.

పారితోషికం అందిననాడు పండుగ చేసుకుంటారు. పాయసం వండుకు తింటారు. లేని నాడు చారుమెతుకులే చాలనుకుంటారు. అయితే సత్యానికివేమీ అక్కర్లేదు. పత్రికలో కథ పడితే చాలు ఆరోజు అతడికి సుష్టుగా భోంచేసినట్లుంటుంది.

ఓరోజు ఉదయం పదైనా పొయ్యి రాజేయలేదు సంధ్య.

''వంట చెయ్యవే ఆకలేస్తోంది'' జాలిగా ముఖం పెట్టి దీనంగా అడిగింది దీప.

హరి కూడా ఆకలికి తాళలేకపోతున్నాడు. అయినా ఇంటి పరిస్థితులు తెలుసుకాబట్టి ఆమాట బయటకు అనలేకపోతున్నాడు.

''పొయ్యిలోంచి పిల్లిని తోలాలంటే గింజలుండాలి. అందుకు డబ్బులు కావాలి. నాన్నని అడుగు'' అంది సంధ్య.

సత్యానికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. తన నవలలు రెండు ప్రముఖ వార పత్రికల్లో ధారావాహికంగా వస్తున్నాయి. అవి పూర్తి అయితే తప్ప వాళ్ళు పారితోషికం పంపరు. అంతవరకు నమ్ముకున్నవాళ్ళను పస్తులుంచగలడా? ఉన్నట్టుండి అతడి మెదడులో మెరుపులాంటి ఆలోచన మెరిసింది. గభాలున లేచి పత్రికల నుండి తిరిగొచ్చిన వ్రాతప్రతుల్ని కుప్పగా పేర్చి ''రేయ్ హరి, వీటిని తీసుకెళ్ళి కిరాణాకొట్లో ఇచ్చేసి బియ్యం పట్టుకురా'' అన్నాడు.

తండ్రి మాట కాదనలేక వాటిని బ్యాగులో వేసుకున్నాడేగాని అమ్మబుద్ధి కాలేదు హరికి. అవి తిరిగొచ్చిన కథలే అయినా వాటి ఇతివృత్తాలు అద్భుతం. తిరిగిరాస్తే కళాఖండాలవుతాయి. విధిలేని పరిస్థితుల్లో నాన్న ఆ నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని అతడికి తెలుసు. అందుకే మరి మారు మాట్లాడకుండా వాటిని పట్టుకెళ్ళి ఓ సాహితీ సంస్థ వారి ముందుంచాడు.

విషయం అర్థమయింది వాళ్ళకి. వెంటనే తమ సంస్థలోంచి కొంత డబ్బు తీసి హరి చేతిలో వుంచారు.

ఆరోజు ఆ ఇంట్లో సత్యంతోసహా అంతా ఎంతో సంతోషంగా ఉన్నారు. ఉగాది నవలల పోటీలో సత్యం విజేత కావడమే అందుక్కారణం.

పత్రికలవాళ్ళు బహుమతిగా పంపిన పదిహేనువేల రూపాయలు చుట్టూ అందరి దృష్టీ పరిభ్రమిస్తోంది.

చెక్కు మార్చి డబ్బు పట్టుకొచ్చి భార్యకిచ్చాడు సత్యం. ఆరోజు అతడికి ఏనుగు ఎక్కినంత సంబరంగా వుంది. దానికితోడు స్నేహితుల ప్రశంసలు అతడిని ఆకాశానికెత్తేస్తున్నాయి.

వచ్చిన డబ్బుకి బడ్జెట్టు ఎప్పుడో సిద్ధమైంది.

''ఇల్లు కారిపోతోంది. ఈ ఏడైనా పెంకు తిరగేయాలి'' ఇండెంటు పెట్టింది ఇల్లాలు.

''నా డ్రస్సులన్నీ చిరిగిపోయాయి. వాటిని వేసుకుని బడికెళ్ళాలంటే సిగ్గుగా ఉంది'' దీనంగా ముఖం పెట్టింది దీప.

''టి.వి కొనుక్కుంటే సినిమాలన్నీ ఇంట్లోనే చూడొచ్చు'' హుషారుగా అన్నాడు హరి.

గాఢంగా నిట్టూర్చాడు సత్యం.

ఎవరి అభిప్రాయాలు వాళ్ళు వెళ్ళగ్రక్కారు. మరి తన మాట ఏవిటని ఎవరూ అడగరేం? తనకు కోరికలుండవనా వాళ్ళ ఉద్దేశం? తనకు ఎప్పటినుండో ఓ కథల సంపుటి అచ్చువేయాలని ఉండేది. కాలం కలిసి రాకపోవడంతో ఆ కోరిక కోరికగానే మిగిలిపోయింది. అయినా ఈ తరుణంలో తన కోరికను బయటపెట్టి వాళ్ళ కోరికలకు కోతవేయకూడదనుకున్నాడు. అవకాశం కుదిరినా కోరిక తీర్చుకోలేకపోతున్నందుకు లోలోన మథనపడసాగాడు. ఫలితంగా అతడి ఆరోగ్యం దెబ్బతింది. మందులు వాడుతున్నా గుణం కనిపించడం లేదు. వచ్చిన సొమ్ము హారతి కర్పూరమైంది. వైద్యులు తమవంతు ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే వున్నారు. మనోవ్యాధికి మందేముంటుంది? ఉన్నట్లుండి గుటుక్కుమన్నాడు సత్యం.



బావురుమన్నారు కుటుంబ సభ్యులు.

ఇక ముందు రోజులెలా వెళ్ళదీయాలో తెలియక కృంగిపోయింది సంధ్య.

★★★

దిక్కుతోచని స్థితిలో ఓ గది అద్దెకివ్వాలని నిర్ణయించుకుంది సంధ్య. అంతేకాదు అప్పడాలు పెట్టి, హరి చేత అమ్మించాలని, దీపని కుట్టుపనిలో పెట్టాలని, దినం గడవడం కోసం ఇలా ఎన్నో నిర్ణయాలు తీసుకుంది.

అంతలో పక్షిలా వాలిందా టెలిగ్రాం.

''శుభవార్తమ్మా'' అన్నాడు హరి ఆనందంలో ఉబ్బితబ్బిబ్బైపోతూ.

ఆశగా చూసింది సంధ్య.

''సాహిత్యరంగంలో నాన్నగారు చేసిన సేవకు గుర్తింపుగా 'సత్యం కథల సంపుటి'కి కథాపీఠం అవార్డు వచ్చిందమ్మా.''

''అయితే మనకు మరో చెక్కపీట దొరుకుతుందన్న మాట.''

సంధ్య మాటలలో అవహేళన ధ్వనిస్తోంది.

''అలా ఎగతాళిగా మాట్లాడకమ్మా! మహామహులకు కూడా లభించని ఈ గౌరవం నాన్నకి దక్కినందుకు మనమెంతో గర్వపడాలి. ఇవాళ తండ్రిగారుంటే ఎంత సంబరపడేవారో? ఆరోజు ఆయన తన వ్రాతప్రతుల్ని అమ్మమని ఇస్తే ఆ పని చేయలేక వాటిని నేను ఓ సాహితీ సంస్థవారికి అందజేసాను. వాటిలో కొన్నిటిని వాళ్ళు పుస్తకరూపంలో ప్రచురించినట్లుంది. దానికీనాడు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఫలితంగా రెండు లక్షల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక బహూకరించబోతున్నారు.''

హరి మాటలకు ఆశ్చర్యపోయింది సంధ్య.

ఆమె నోట మాట రావడం లేదు.

కళ్ళ నీళ్ళు కుండలయ్యాయి.

''నాన్నకు లభించిన ఈ పురస్కారాన్ని వారి కుటుంబ సభ్యులెవరైనా స్వీకరించవచ్చునన్నారు. నువ్వెళ్ళి ఆ బహుమతి అందుకో అమ్మా'' బతిమలాడాడు హరి.

''వద్దు బాబు. నాకా అర్హత లేదు. అందుకు నీకే యోగ్యత వుంది. భార్యగా నా బాధ్యతను విస్మరించినా, కొడుకుగా నీ కర్తవ్యాన్ని నిర్వర్తించావు.''

ఆ మాటలు అంటున్నప్పుడు ఆమె కళ్ళు కుండపోతగా వర్షించాయి. ఏదో తప్పు చేసానన్న భావన ఆమె మోములో ప్రస్ఫుటితమౌతోంది.

''అలా అనకమ్మా! మా క్షుద్బాధను తీర్చడం కోసం నువ్వేవో నిర్ణయాలు తీసుకున్నావే తప్ప నాన్నమీద గౌరవం లేకకాదు. ఆ విషయం నాకు తెలుసు. లేమి ముందు ఆప్యాయతలు, అభిమానాల లాంటివేవీ నిలబడవు. ఆకలి ఆత్మీయతల్ని లెక్కచేయదు. దానికంతటి మహత్తర శక్తి వుంది. నీ ఈ చర్యలన్నీ దాని దర్పణమే. అందుకు నిన్ను నీవు నిందించుకోవడం భావ్యం కాదు. ఈ పురస్కారాన్ని నువ్వందుకోవడమే న్యాయం. అలా చేస్తే చనిపోయిన నాన్న ఆత్మ ఎంతగానో సంతోషిస్తుంది. నాన్నగారు అంటుండేవారు నువ్వన్నా, తన రచనలన్నా ప్రాణంతో సమానమని, మరచిపోయావా?''

ఉద్వేగభరితమైన బిడ్డ మాటలకు మంత్ర ముగ్ధయింది సంధ్య.

★

దూరి వెంకటరావు